క్లుప్తంగా

జాంబవంతుడికి పూజలు



ప్రత్యేక అలంకారంలో జాంబవంతుడు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకమ్మ నగర్‌లో వెలసివున్న జాంబవంతుడి ఆలయం లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. భక్తులు జాంబవంతుడిని దర్శించుకుని అర్చనలు, అభిషేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ధోబీ ఘాట్ ఆక్రమణ



ఎస్‌కేఆర్ నగర్ గ్రామ శివారులో ధోబీ ఘాట్ ప్రాంతాన్ని చదును చేసిన దృశ్యం

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ ఎస్‌కేఆర్ నగర్‌లో చేనేత క్లస్టర్ భవనం వద్ద నున్న రజకుల ధోబిఘాట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని స్థానిక రజకులు పెనగలూరు నరసింహ, కీర్తి, నాగరాజమ్మ, మల్లికలు తెలిపారు. ఈ సందర్భంగా వారు బుధవారం మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం మా గ్రామం ఎస్‌కేఆర్ నగర్ శివారులోని చేనేత క్లస్టర్ భవనం వద్ద మా రజకులకు గ్రామ పెద్దల సహాయంతో ప్రభుత్వం ధోబిఘాట్‌ను నిర్మించారన్నారు. అయితే ఈనెల 2వ తేదీన రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీ సాయంతో ధోబిఘాట్‌ను చదును చేసి స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ధోబిఘాట్‌ను ఆక్రమణకు గురికాకుండా మండల తహసీల్దారు న్యాయం చేయాలని రజకులు కోరుతున్నారు.

శిథిలావస్థకు పశు వైద్యశాల



పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్న దేవపట్ల పశు వైద్యశాల కార్యాలయం

సంబేపల్లె : మండలంలోని దేవపట్లలోని ప్రభుత్వ పశువైద్యశాల కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. చిన్నపాటి వర్షానికి నీరుగారి పెచ్చులు ఊడుతోంది. నిత్యం పెద్ద సంఖ్యలో పాడిరైతులు పశువులను తీసుకువచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పశువైద్యానికి సంబంధించి మందులు తదితర సామగ్రి భద్రపరుచుకోవాలంటే ఇబ్బంది ఏర్పడింది. తరచూ పైకప్పు పెచ్చులు ఊడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పాడిరైతులు కోరుతున్నారు.


ముద్దా పిచ్చిరెడ్డికి నివాళి



ముద్దా పిచ్చిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి

పుల్లంపేట : మండలం పరిధిలోని అనంతసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ముద్దా పిచ్చిరెడ్డి(70) అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి మృతుని స్వగృహానికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులర్పించి, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సౌమిత్ర, గుంటి మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ భూమిలో సూచికబోర్డును ఏర్పాటు చేసిన దృశ్యం

పుల్లంపేట : మండలంలోని తిప్పాయిపల్లి రెవెన్యూ గ్రామంలోని 542/6 సర్వే నెంబరులో గల 4.98 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన భూమిలో బుధవారం తహసీల్దార్ వెంకటనారాయణ సూచికబోర్డు ఏర్పాటు చేశారు. గతంలో పలుమార్లు ఆక్రమణదారులు ఈ భూమిని ఆక్రమించుకున్నారని చెప్పారు. ఇకపై ఈ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కలిసికట్టుగా రాజంపేటను అభివృద్ధి చేద్దాం

- పట్టణాభివృద్ధికి తనవంతు సహకారం
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి



బంగారు పతకం సాధించిన అస్లామ్‌ను సత్కరిస్తున్న ఆకేపాటి, పోలా



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్ : అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు రాజకీయాలను పక్కన పెట్టి కలిసికట్టుగా రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో బుధవారం మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆకేపాటి పాల్గొని మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యే అవకాశం అందరికి రాదన్నారు. అలాంటిది మనకు ప్రజలు ఓట్లు వేసి ప్రజాప్రతినిధులుగా ఎన్నుకున్నందుకు ప్రజల ఆకాంక్షల మేరకు మెరుగైన సేవలు అందించేందుకు కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. ఇప్పుడు ఎన్నికలు లేవని అందువల్ల రాజకీయాలు చేయాల్సిన సమయం కూడా కానందున ప్రతి ఒక్కరి ఆలోచన ప్రజాసేవే కావాలన్నారు. అభివృద్ధికి సంబంధించి తనవంతు సహకారం ఉంటుందన్నారు. రాజంపేట మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, శానిటేషన్ అధికారులు పారిశుధ్యంపై మరింత శ్రద్ధ చూపి ఎక్కడా చెత్త నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత విభాగం అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. కాగా తొలుత ఎమ్మెల్యే మున్సిపల్ ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆకేపాటిని పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లు బొకేలు అందజేసి సత్కరించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు మర్రి రవి, షేక్ షమియా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో రాజంపేటకు జాతీయ స్థాయి గుర్తింపు

ఈ ప్రాంతానికి చెందిన క్రీడాకారులు వివిధ క్రీడల్లో రాణిస్తూ జాతీయ స్థాయిలో రాజంపేటకు గుర్తింపు తీసుకొస్తుండటం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన అస్లామ్‌ను బుధవారం స్థానిక ఆంధ్రకళ్యాణ మండపంలో ఎమ్మెల్యే ఆకేపాటి, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజంపేట ప్రాంతానికి చెందిన అనేక మంది జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తుండటం మన అందరికి గర్వకారణమన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాజంపేట ప్రాంతంలో అనేక మంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారని, అందువల్లే పలుమార్లు రాజంపేటలో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలను సైతం సమర్థవంతంగా నిర్వహించగలిగామన్నారు. కాగా పట్టణంలోని ముస్లిం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేగా గెలిచినందుకు ఆకేపాటి అమరనాథరెడ్డిని ఘనంగా సత్కరించారు.

నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరైన ఆకేపాటి

వీరబల్లి : మండలంలోని వంగిమల్ల పంచాయతీ కావలిగడ్డకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు రెడ్డయ్య కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి హాజరయ్యారు. ఇందులో భాగంగా వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాలివీటి ధర్మారెడ్డి, పెద్దివీడు సర్పంచ్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, మాజీ ఎంపీటీసీ జయచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్

గాలివీడు : నేడు విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీఎస్‌ఎఫ్ కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు డి.కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మాట్లాడుతూ నీట్, నెట్ పరీక్షల లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసమర్థంగా పరీక్షలు నిర్వహిస్తున్న ఎన్టీఏను రద్దు చేస్తూ, లీకేజీకి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులంతా తరగతులు బహిష్కరించి బంద్‌లో పాల్గొని నిరసనలు తెలియజేయాలని కోరారు. ఆయనతోపాటు విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రిమ్స్ హాస్పిటల్‌లో సమస్యలు పరిష్కరించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి కోరారు. బుధవారం రిమ్స్ ఆసుపత్రిని ఆర్‌సీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తాళాలకే పరిమితమైందని, అందులో పని చేయటానికి సిబ్బంది, వైద్య పరికరాలు లేవన్నారు. ఓపీలోని ఎక్స్‌రే, సిటీ స్కానింగ్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ లో వర్క్ స్టేషన్ రిపోర్టింగ్ సిస్టం, టెక్నీషియన్స్, డేటా ఆపరేటర్లు, అర్హత కలిగిన వైద్యులను నియమించాలన్నారు. ఇంకా పలు సమస్యలు ఉన్నాయని, అన్నింటినీ పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు



ప్లాస్టిక్ నిషేధంపై ముద్రించిన కరపత్రాలను విడుదల చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

రాయచోటి అర్బన్ : ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి తీరని ముప్పును కలిగిస్తుందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కొత్తపేట రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథరెడ్డి, మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డిలు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణ కాలుష్యం చోటుచేసుకుంటుందన్నారు. ఇష్టారాజ్యంగా ప్లాస్టిక్ వినియోగంలో అనేక సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లు భూమిలో కుళ్లిపోవడానికి వందల సంవత్సరాలు పడుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకంను పూర్తిగా తగ్గించేసి ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి తమవంతు కృషి సల్పాలంటూ కోరారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షులు చాన్‌బాషా, నాగార్జునాచారి, కార్యదర్శి ఇందాద్‌బాషా, సభ్యుడు ప్రకాష్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఎర్రగుంట్లమ్మ జాతర

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె ప్రజలు ఎర్రగుంట్లమ్మ .. కురుణించమ్మా అంటూ బుధవారం భక్తిశ్రద్ధలతో జాతర నిర్వహించారు. తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండ అటవీ ప్రాంతం పాలమేర్లలో వెలసిన ఎర్రగుంట్ల ఆలయంలో జాతర నిర్వహించారు. మహిళలు దీలు, బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు. చాందినీ బండ్ల మెరవణి ఆకట్టుకున్నాయి.

పిల్లల చదువు ఇంటికి వెలుగు

మదనపల్లె సిటీ : పిల్లల చదువు ఇంటికి వెలుగు అని మున్సిపల్ చైర్మన్ వి.మనూజారెడ్డి అన్నారు. బుధవారం బాలికల ఉన్నత పాఠశాలలో క్రై,ఫోర్డు సంయుక్త ఆధ్వర్యంలో పూరి పదాయ దేశానికి భళాయ్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలికలు చదవాలి, ఎదగాలి, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి బిడ్డను చదవించడం తల్లిదండ్రుల బాధ్యతన్నారు. సమాజంలో అమ్మాయిలకు చదువుకునే స్థానం తల్లిదండ్రులు కల్పించాలని కోరారు. అమ్మాయిలను, అబ్బాయిలను వేర్వేరుగా చూడరాదన్నారు. అనంతరం ప్రచార కార్యక్రమం బోర్డులో సంతకాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, రఫి, ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ, సంస్థ సిబ్బంది రాధారాణి, అల్తాఫ్, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారిని తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో లక్ష్మీహయగ్రీవ హోమము, వేదస్వస్తి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన బాట తప్పదని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఎన్ఎంయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యూనియన్ సమావేశానికి ముందుగా ఆయన మీడియాతో మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా మరింత జటిలం చేస్తున్నారన్నారు. సస్పెండ్‌కు గురైన వారిని తిరిగి విధుల్లో తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడంలో చూపుతున్న శ్రద్ధ సమస్యలను పరిష్కరించడంలో చూపించకపోవడం బాధాకరమన్నారు. డిపోల మేనేజర్లు చేస్తున్న తప్పిదాలకు మౌనం వహించడం ఉన్నతాధికారులకు తగదన్నారు. అనేక సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించకపోవడంతోనే ఉద్యమ కార్యచరణ చేపట్టాలని నిర్ణయించామన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు



రామచంద్ర దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

సుండుపల్లె : ఉపాధ్యాయులు పనిచేసిన చోట గుర్తింపు తెచ్చుకుంటే జీవితాంతం ఆ గ్రామంలో గుర్తించుకుంటారని ఎంఈఓలు వెంకటేష్ నాయక్, రవీంద్ర నాయక్‌లు తెలిపారు. సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మేకల రామచంద్ర పదవీ విరమణ సందర్భంగా ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన మేకల రామచంద్ర 40 సంవత్సరాల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యావంతులను అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు జయన్న మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా విద్యాబోధన చేసి మంచి ప్రయోజకులు చేస్తే వారు ఉపాధ్యాయులను జీవితాంతం మరచిపోలేరన్నారు. అనంతరం రామచంద్ర దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు శ్రీనివాసరాజు, అన్నమయ్య జిల్లాల ఎస్టీయూ అధ్యక్షుడు శివారెడ్డి, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు హరిబాబు, జీకే రాచపల్లి హెచ్‌ఎం సుమలత, బి.కోడూరు మండలం ఎంఈఓ సునీల్ కుమార్, బంధువులు, స్నేహితులు, పాఠశాల ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలతో భవిష్యత్తు బాట



మాట్లాడుతున్న జిల్లా అధికారి జనార్దన

రాజంపేట టౌన్ : దివ్యాంగ పిల్లలను తల్లిదండ్రులు భవిత కేంద్రాలకు పంపాలని సమ్మిళిత విద్య సెక్టోరల్ జిల్లా అధికారి కె.జనార్దన తెలిపారు. స్థానిక భవితా కేంద్రంలో బుధవారం దివ్యాంగ పిల్లలకు ఉపకరణాల మంజూరుకై నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగ పిల్లలకు అవసరమైన వీల్ చైర్లు, ట్రై సైకిళ్ళు, రిలేటర్స్, కాలిపర్స్, సీపీ చైర్, వినికిడి యంత్రాలను కొద్దిరోజుల తరువాత పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగుల పిల్లలను భవిత కేంద్రాలకు పంపితే వారి భవిష్యత్తుకు బాటలు పడతాయన్నారు. ప్రతి మండలంలో భవిత కేంద్రాలు ఉన్నాయని, అందువల్ల మానసిక, శారీరక దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రాలకు పంపాలని చెప్పారు. ఈ కేంద్రాలకు పంపే పిల్లలకు అవసరమైన సౌకర్యాలు, అలవెన్స్‌లను ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా ఈ శిబిరంలో 120 మంది దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 కొండూరు రఘునాథ రాజు, ఎంఈఓ-2 సుబ్బరాయుడు, వివిధ విభాగాల వైద్య నిపుణులు ఎల్లారెడ్డి, హరికృష్ణ, నరసింహారావు, గీత తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సమస్యలు పరిష్కారం



స్కూటర్లపై ర్యాలీ నిర్వహిస్తున్న టూవీలర్స్ అసోసియేషన్ నాయకులు

రాయచోటి టౌన్ : సమష్టి కృషితోనే మన సమస్యలను పరిష్కరించుకోగలమని రాయచోటి టూ వీలర్స్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పఠాన్ హబీబుల్లాఖాన్ అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలో మెకానిక్స్ డే సందర్భంగా రాయచోటి పట్టణంలోని టూ వీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్ సంఘాల నాయకులు, మెకానిక్‌లు టూ వీలర్స్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూ వీలర్స్ మెకానిక్‌లు ఐక్యంగా ఉండాలని, అప్పుడే మన సమస్యలను పరిష్కరించుకోగలమని చెప్పారు. సమస్యలు ఏవైనా వచ్చినప్పుడు అందరం కలసికట్టుగా పోరాటం సాగిద్దామని సూచించారు. అనంతరం అందరూ ఓ చోటుకు చేరి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అబ్బూరి ఆనందనాయుడు, ఆసీఫ్, మహమ్మద్ షరీఫ్, సెక్రటరీ షౌకత్, జాయింట్ సెక్రటరీ మహబూబ్ బాషా, ట్రెజరర్ ఆయాస్, సభ్యులు మహమ్మద్ సలీం, రెడ్డికుమార్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం



గర్భిణులతో అధికారులు, అంగన్‌వాడీ వర్కర్లు

చిట్వేలి : రాజుకుంటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సీమంతం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీఓ రాజేశ్వరి మాట్లాడుతూ తల్లి సౌభాగ్యాన్ని బిడ్డ దీర్ఘాయుస్సును కోరుతూ చేసేదే సీమంతం వేడుకని, ఈ వేడుక ప్రతి గర్భిణీ జీవితంలో ముఖ్యమైన ఘట్టమన్నారు. అనంతరం 15 మంది గర్భిణులకు సీమంతం చేశారు. ప్రతి గర్భిణీకి గాజులు తొడిగి పసుపు కుంకుమలు రాస్తూ పండంటి బిడ్డను ప్రసవించాలని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ప్రతి ఒక్కరికీ తాంబూలాలను అందజేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ సుమనీ మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇలాంటి సామూహిక వేడుకలు నిర్వహించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెంగమ్మ, గ్రేడ్-1 సూపర్‌వైజర్లు వసుందరమ్మ, విశాలాక్షి, సురేఖరాణి, జీఎంఎస్ శోభ, ఏఎన్ఎం ఫరిదా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, అంగన్‌వాడీ వర్కర్లు మాధవి, సుబ్బలక్ష్మి, శ్రీదేవి, రాజేశ్వరీ, హెల్పర్లు, ఆశ వర్కర్లు బాలమ్మ, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో మామిడిలో అధిక దిగుబడి

హార్టికల్చర్ అధికారి ఈశ్వర ప్రసాద్ రెడ్డి

నిమ్మనపల్లె : సరైన సస్యరక్షణ చర్యలతో మామిడి పంటలు అధిక దిగుబడి సాధించవచ్చని మదనపల్లె హార్టికల్చర్ అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... మండలంలో 13 ఎకరాల్లో మామిడి పంట సాగు అవుతుందన్నారు. మామిడి పంట కోత అనంతరం తప్పనిసరిగా కొమ్మ కత్తిరింపులు చేయాలన్నారు. చెట్టు చుట్టూ పాదులు ఏర్పాటు చేసి 1.5 కిలోల యూరియా మూడు కిలోల సూపర్ ఫాస్పేట్ ఒక కిలో పొటాష్ కలిపి పాదులలో వేసి నీరు పెట్టుకోవాలన్నారు. ఇలా చేయడం వలన ఒకే సమయానికి పూత వస్తుందన్నారు. ఉద్యానవన పంటల సాగులో ఉపయోగిస్తున్న బిందు సేద్య పరికరాలకై, 2024-2025 సంవత్సరానికి గాని నివేదికలు పంపడం జరిగిందన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే రాయితీపై రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు.

ప్రతి మంగళవారం నిమ్మనపల్లెలో ..

ఇకపై ప్రతి మంగళవారం నిమ్మనపల్లె మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు తగు సలహాలు సూచనల కోసం సంప్రదించాలని కోరారు.

వలీమాకు హాజరైన నాయకులు



వలీమా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

లక్కిరెడ్డిపల్లె : మండల కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్ సోదరుడు జమీర్ కుమారుడు జబీవుల్లా వలీమా కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు గడికోట మోహన్‌రెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డప్ప రెడ్డి అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డిలు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం రాయచోటిని ఏఎస్‌బీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, సిద్ధక నాగిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రవిరాజు, ఎంపీటీసీలు జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు అహ్మద్ బాషా, ఉప సర్పంచ్ రాజారెడ్డి, రవి ఆచారి, మైనార్టీ నాయకులు చాన్ బాషా, జాకీర్, వార్డు మెంబర్ ఖాజా, వైఎస్సార్ సీపీ నాయకులు దిన్నెపాటి గజేంద్రారెడ్డి, నాగిరెడ్డి, రవిరెడ్డి, నాగేంద్ర బాబు, ఇస్మాయిల్, అన్వర్, మహ్మద్ అలీ, మన్సూర్, అంజి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

పీలేరు రూరల్ : ప్రయాణీకులకు ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని డీఎం బి. కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సుండుపల్లె, సోమల మార్గాల్లోని ప్రయాణీకులకు లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు. పీలేరు- సుండుపల్లె మార్గంలో మొదటి బహుమతి కె. మునిరాజ, ద్వితీయ బహుమతి భూదేవి, తృతీయ బహుమతి గౌతమ్‌లకు లభించాయి. సోమల - కలకడ మార్గంలో మొదటి బహుమతి ఎస్. రెడ్డెమమ ద్వితీయ బహుమతి పి. షికా, తృతీయ బహుమతి ఆర్. సాంబశివలకు మౌర్య కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దేవులపల్లె మౌర్యరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

కళలను కాపాడుకుందాం



వినయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

రాయచోటి టౌన్ : మన సంస్కృతి సంప్రదాయాలుగా ప్రతిబింబమైన కళలను కాపాడుకుందామని డాక్టర్ అబ్దుల్ కలాం యువ కెరటం ట్రస్టు డైరెక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని శ్రీబాగ్ లింగంపల్లె సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీ లలిత కళ నృత్యనికేతన్ వారు సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి శంభో శివ శంభో అనే నృత్య కళల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళలను ప్రోత్సహిస్తున్న వారిని సత్కరించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్‌ను రాయచోటి (అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా) సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు పలు కళలను నిర్వహించినందుకు ఘనంగా సన్మానించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సిద్దవటం : బీసీ బాలుర వసతి గృహంలో ఏసీఎం స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం



ఒంటిమిట్ట : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రామచంద్ర

సిద్దవటం : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్లు సుబ్బరాయుడు తెలిపారు. వ్యతిరేక మలేరియా మాసోత్సవాల సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఏసీఎం 5శాతం ఫోకల్ స్ప్రేయింగ్ చేయించారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు రాకుండా నివారించవచ్చునన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వల్ల డయేరియాను నిరవారించవచ్చన్నారు. దోమలు పుట్టకూడదని, కుట్టకూడదన్నారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడాలన్నారు. అలాగే రాత్రి వేళల్లో శరీరానికి ఫుల్ వస్త్రలను ధరించాలన్నారు. ఆల్ అవుట్‌ను ఉపయోగించాలన్నారు. లేదంటే వేపాకు పొగను వేసుకుంటే దోమలను నివారించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, సీహెచ్ఓ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచండి

ఒంటిమిట్ట : స్టాప్ డయేరియా అంశంపై బుధవారం ఒంటిమిట్ట ఎంపీడీఓ రామచంద్ర విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఒంటిమిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు, స్థానిక ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లోని విద్యార్థులకు పారిశుద్ధ్యం, పరిశుభ్రత గురించి తెలియజేసి, నీటి కాలుష్యం, అపరిశుభ్రత వల్ల వచ్చే వ్యాధుల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో పనిచేస్తున్న హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడుతూ విద్యార్థులకు పెట్టే భోజనంలో నాణ్యత పాటించాలన్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రంగయ్య, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, జెడ్పీహెచ్ఎస్ ప్రధాన ఉపాధ్యాయురాలు వెంకట్ లక్ష్మమ్మలు పాల్గొన్నారు.